క్లుప్తంగా

సీఎం పీఆర్‌ఓకు సన్మానం


విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న అశోక్

కారేపల్లి: సీఎం పీఆర్‌ఓగా ఎంపికైన దూదిపాళ్ల విజయ్‌కుమార్‌ను హోమియోపతిక్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ అవార్డు గ్రహీత పరికిపండ్ల అశోక్ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలుస్తున్న విజయ్‌కుమార్ అంచలంచెలుగా ఎదిగి సీఎం పీఆర్‌ఓ కావడం గర్వకారణమన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసన్న జ్యోతి

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సివిల్ సర్జన్ కె.ప్రసన్న జ్యోతి హాజరై మాట్లాడుతూ... సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సుజాత, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్. ఎస్ ఇందిర, ఎకనామిక్స్ అధ్యాపకురాలు జి.అరుణ, డాక్టర్ కే.వీరన్న, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి ఆశ్రయం


వృద్ధున్ని తీసుకెళ్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

మధిర: మధిర పట్టణం ఆర్సీఎం చర్చి దగ్గరలో రెండు రోజులుగా పక్షవాతంతో అచేతన స్థితిలో ఉన్న గుర్తుతెలియని వృద్ధుడికి మంగళవారం స్థానిక ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ ఆశ్రయం కల్పించారు. వృద్ధుడిని గమనించిన ఫౌండేషన్ నిర్వాహకులు అతనికి వైద్య చికిత్సలు అందించి ఫౌండేషన్ అనాథాశ్రమానికి తరలించారు.

నిత్యావసర సరుకులు వితరణ


సరుకులు అందజేసిన దాతలు

మధిరరూరల్: మధిర పట్టణంలో నిర్వహిస్తున్న మదర్ థెరిస్సా మానసిక వికలాంగుల కేంద్రానికి మంగళవారం నిత్యావసర సరుకులను వితరణగా అందజేశారు. టీడీపీ ఐటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమూరి సునీల్ కుమార్తె ఎన్నారై కుమ్మెట హేమబిందు పుట్టిన రోజు సందర్భంగా ఆమె భర్త కుమ్మెట చంద్రశేఖర్, కుమారుడు కార్తీక్ ఆదిత్య, కుమార్తె లాస్య ఆధ్వర్యంలో బియ్యం, నిత్యవసర సరుకులు అందజేసినట్లు నిర్వాహకులు నల్లపు స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీరు పంపిణీ


కూలింగ్ వాటర్ పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

పెనుబల్లి : పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మినరల్ కూలింగ్ వాటర్ పంపిణీ చేస్తున్నట్టు క్లబ్ అధ్యక్షులు నాళ్ల జయరాం తెలిపారు. మండల పరిధిలోని వియంబంజర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టేకులపల్లి మోడల్ స్కూల్ పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ మినరల్ కూలింగ్ వాటర్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ఎస్‌కె.అబ్దుల్ సలాం, క్లబ్ బాధ్యులు సుంకర సత్యనారాయణ, పోట్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక బడి బాధ్యత అమ్మదే..!

సర్కారు బడుల పర్యవేక్షణకు మహిళా సంఘాలు

- ఎస్ఎంసీల స్థానంలో ఆదర్శ కమిటీలు
- 19 పాఠశాలల్లో కమిటీలు, అభివృద్ధికి నిధులు మంజూరు



బస్వాపురం ప్రాథమిక పాఠశాల

కొణిజర్ల: ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతలు సదరు పాఠశాలలో చదువుతున్న చిన్నారుల అమ్మలే చూడనున్నారు. ఈ మేరకు మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మౌలిక వసతుల కల్పన, పాఠశాలల బలోపేతానికి అవసరమైన పనులు చేపట్టే బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. గతంలో ఈ పనులు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు చేపట్టే వారు ఇప్పుడు వారి స్థానంలో మహిళా సంఘాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పలు పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు కూడా పూర్తి చేస్తున్నారు.

ఎస్ఎంసీ స్థానంలో..

గతంలో ఎస్ఎంసీ చైర్మన్ సభ్యుల నియామకం ఉండేది. ఇప్పుడు వారి స్థానంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు(వీఓ) అమ్మ ఆదర్శ కమిటీకి చైర్మన్‌గా, పాఠశాల హెచ్ఎం కన్వీనర్‌గా ఉండనున్నారు. 1 నుంచి పది తరగతులు చదివే విద్యార్థుల తల్లుల్లో ప్రతీ తరగతి నుంచి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు. వీరు కూడా ఎస్‌హెచ్‌జీలలో సభ్యులై ఉండాలి. ఆ ముగ్గురిలో ఒకరు ఎస్సీ, ఎస్టీ అయి ఉండాలి. గ్రామంలో ఒకే వీఓ ఉండి పాఠశాలలు ఎక్కువ ఉంటే అని పాఠశాలలకూ సదరు వీఓనే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీల నియామకం పూర్తయిన తర్వాత అమ్మ ఆదర్శ కమిటీ పేరుతో బ్యాంకులో ప్రత్యేక ఖాతా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఎస్ఎంసీ ఖాతా ఉన్నా ఇప్పుడు కొత్తగా ఖాతా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొత్త ఖాతాల ఏర్పాటులో నిమగ్నమయ్యారు.

కమిటీ విధులు..

అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాఠశాల నిర్వహణలో పాలు పంచుకుంటారు. పాఠశాలల పర్యవేక్షణ, మౌళిక వసతుల కల్పన బడుల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, తరగతి గదులలో విద్యుత్ ఏర్పాట్లు, పారిశుధ్య పనులు తదితర పనులు పర్యవేక్షిస్తారు.

మండలంలో 19 పాఠశాలలకు..

కొణిజర్ల మండలంలో మొత్తం 54 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుండగా వాటిలో 19 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలకు నిధులు మంజూరయ్యాయి. రూ.25 వేల లోపు పనులు ఎలాంటి టెండర్లు లేకుండా సదరు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులే చేయించవచ్చు. రూ.1లక్ష దాటితే కలెక్టర్ పర్యవేక్షణలో పనులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం మే నెలలో సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు. మరుగుదొడ్లు తదితర మౌలిక వసతుల కల్పన పనులు చేయించనున్నారు.

కమిటీల ఏర్పాటు జరుగుతోంది..



మండలంలో 19 పాఠశాలలకు మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది, రూ.25 వేల నుంచి రూ 2.50 లక్షల వరకు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల వినియోగం కోసం అమ్మ ఆదర్శ కమిటీల నిర్మాణం పూర్తి చేయాలని హెడ్మాస్టర్లను ఆదేశించాం. ఈ నెలాఖరు నాటికి కమిటీల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తారు.

– మోదుగు శ్యాంసన్, ఎంఈఓ కొణిజర్ల

సౌకర్యాలు మెరుగుపరచాలి


పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

ముదిగొండ: పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మెరుగుపరచాలని అధికారులకు ఖమ్మం ఆర్డీఓ గణేష్ సూచించారు. మండలంలోని ముదిగొండ, వెంకటాపురం, మేడేపల్లి, కట్టకూరు, యడవల్లి, యడవల్లి లక్ష్మీపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలలో వసతులపై ఆరా తీశారు. మంచినీరు, విద్యుత్, గదులు సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ రామారావు, ఎంపీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీ రామాయణ సప్తాహం ప్రారంభం


ఊరేగింపులో భక్తులు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని శ్రీరామాయణ సప్తాహం కార్యక్రమాన్ని ప్రముఖ ప్రవచనకర్త ఎన్‌సిహెచ్ రామకృష్ణమాచార్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ భూనీలాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఏడురోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పండితులు పాల్గొంటారని, 30న శ్రీత్రిదండి అష్టాక్షరీ జీయర్ స్వామి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల లీలాకృష్ణ, మందపాటి కేశవరెడ్డి, నాగారపు సుబ్బారావు, శంకర్‌రావు, వెంకటేశ్వరరావు, రాఘవయ్య పాల్గొన్నారు.

లారీలకు బొగ్గు లోడింగ్ పెంచండి


జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్‌ను సన్మానిస్తున్న లారీ యూనియన్ నాయకులు

సత్తుపల్లి: బొగ్గు లోడింగ్‌పైనే ఆధారపడిన సత్తుపల్లి లారీ యూనియన్ పరిధిలోని లారీలు, టిప్పర్లకు లోడింగ్ పెంచాలని సత్తుపల్లి జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్‌ను మంగళవారం యూనియన్ అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డి కలిసి విన్నవించారు. నాణ్యమైన బొగ్గును సకాలంలో అందించి రవాణా సదుపాయం కల్పించాలని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీఓ ప్రహ్లాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లారీ అండ్ టిప్పర్ యూనియన్ సెక్రటరీ కీజర్, గౌరవ సలహాదారులు రావి నాగేశ్వరరావు, మధార్, నాగమల్లేశ్వరరావు, పామర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే వాహనాలు సీజ్


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ టి.కిరణ్

సత్తుపల్లిటౌన్: నెంబర్ ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని సత్తుపల్లి సీఐటి.కిరణ్ స్పష్టం చేశారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ప్రధాన వీధుల్లో స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. బస్టాండ్ పరిసరాలలో ఫుట్ ముందు ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసి కేసు నమోదు చేశారు. నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వేణుగోపాల స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తల్లాడ: తల్లాడలో సోమవారం రాత్రి రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. ముందుగా రుక్మిణీ సమేత సంతాన వేణుగోపాల స్వామిని గ్రామోత్సవం చేసి కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

సత్తుపల్లిరూరల్: ఎండలు పెరుగుతున్న నేపథ్యాన సత్తుపల్లి జేవీఆర్ సీహెచ్‌పీలో ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జ్ ట్ సెక్రటరీ నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం డీవైజీఎం సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎండలు పెరుగుతున్నందున కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని, పనివేళల్లో మార్పులు చేయడంతో పాటు అవసరమైన ప్రదేశాల్లో కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతికుమార్, నాయకులు నగేష్, రమేష్, ఈశ్వర్, చంద్రమౌళి, రాజమౌళి, శంకర్, మోహన్, కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, చందు, వెంకటేశ్వర్లు, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

ప్రతీ నెల వేతనాలు చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మధిర: మధిర మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు క్రమం తప్పకుండా ప్రతీనెలా వేతనాలు చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మధిర మున్సిపల్ మేనేజర్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మధిర మున్సిపాలిటీలో నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వటం లేదన్నారు. కార్మికులకు తెలియకుండా కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో సొమ్ము మినహాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చటారి నాగేంద్రం, పుల్లూరి నరేష్, గద్దల శ్రీకాంత్, చటారి కుమార్, ఎంబ్రవల్లి చిన్ని, సిలివేరు సురేష్, గడ్డం మారతమ్మ, కుమారి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

జలబిందెల ఊరేగింపు


పెద్దప్రభ ఊరేగింపు

ముదిగొండ: మండలపరిధిలోని కమలాపురంలో శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మి, శ్రీమద్దిరావమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల జాతర సందర్భంగా రెండో రోజు మంగళవారం అయ్యగారపల్లి, కమలాపురం గ్రామాల్లో పెద్ద ప్రభ ఊరేగింపు, జలబిందెలతో అమ్మవార్లకు సమర్పించుట కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో శ్రీఅంకమ్మ మాలాదారులు, భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన


ఉపాధి పనులను పరిశీలిస్తున్న నాయకులు

చింతకాని: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా సమితి అధ్యక్ష, కార్యదర్శులు పగిడిపల్లి ఏసు, తాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో కూలీలు చేస్తున్న ఉపాధి హామీ పనులను మంగళవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు నవంబర్ నుంచి ఇప్పటివరకు వేతనాలను చెల్లించకపోవటంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుర్ర అంజయ్య, ఆవుల అశోక్, వీరయ్య, నాగలక్ష్మీ, నాగమల్లమ్మ, కుక్కుల ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


భక్తులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

మధిర : మండలంలోని ఆత్కూరు అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం అంకే అప్పారావు, సంధ్యారాణి ఆర్థిక సహకారంతో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు వెలగపూడి హనుమంతరావు, డాలు కృష్ణ, సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

భక్తాంజనేయ స్వామి ఆలయంలో..



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో అయ్యగారిపేట భక్తాంజనేయస్వామి ఆలయంలో బొంతు మాధవరావు, హేమలత దంపతులు భక్తులకు మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగళ్ల ప్రసాద్, వల్లభనేని పవన్, నాగళ్ల రామారావు, నాగళ్ల భాస్కర్ చౌదరి, పురుషోత్తమ చారి, రజిని భక్తాంజనేయ భజన బృందం పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం


చిరుమర్రి వద్ద ప్రారంభమైన లో లెవల్ చప్టా పనులు

- మొదలైన చప్టా పనులు

ముదిగొండ: ముదిగొండ మండలంలోని పలు లోలెవల్ చప్టాల పనులు మొదలు కావడంతో ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులకు మోక్షం కలిగినట్లయింది. మండలంలోని చిరుమర్రి, వనంవారికిష్టాపురం, బాణాపురం, వల్లభి, మేడేపల్లిలలో లో లెవల్ చప్టాలున్నాయి. వీటిపై ప్రయాణం సాగించటానికి వాహనదారులు నానా ఇబ్బందులు పడేవారు. ప్రతీ సారి వానా కాలంలో చప్టాల వద్ద ప్రజలు ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు పలు మార్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఆయన కొత్త ప్రభుత్వం వచ్చిన మూడు నెలలోనే నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు వాటిలో మొదటి దశలో చిరుమర్రి చప్టా పనులు మొదలుపెట్టారు. డిప్యూటీ సీఎం కృషి ఫలితంగానే ఎట్టకేలకు చిరుమర్రి వద్ద ఉన్న చప్టా పనులు కొనసాగుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పనులు కొనసాగడంతో సర్వీస్ రోడ్డు నుంచి రాకపోకలు సాగుతున్నాయి. ఈ మేరకు చప్టాలు పనులు నాణ్యతతో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గేటు తీసేవరకు ఆగాల్సిందే..!

- రైల్వేగేట్ల వద్ద ప్రయాణికులకు అవస్థలు
- మూడు, నాలుగు రైళ్లు వెళ్లే వరకు తెరుచుకోని గేట్లు..
- అత్యవసర పరిస్థితుల్లో మరీ దారుణం
- ఆర్వోబీలు నిర్మించాలని వేడుకోలు..


ఎర్రుపాలెం రైల్వేగేటు వద్ద నిలిచిన వాహనదారులు

ఎర్రుపాలెం: మండలంలోని ఎర్రుపాలెం, రేమిడిచర్ల రైల్వే గేట్లు ప్రయాణికులను తీవ్ర అవస్థలు గురి చేస్తున్నాయి. మండలకేంద్రంలోని రైల్వేగేటు, రేమిడిచర్ల గ్రామ సమీపంలోని మరో రెండు గేట్ల దగ్గర కూడా నిత్యం ప్రయాణికుల నిరీక్షణ తప్పడం లేదు. ఎర్రుపాలెంలోని రైల్వే గేటు వద్ద ప్రయాణీకులు పడే అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. విజయవాడ టూ ఖమ్మం, ఖమ్మం టూ విజయవాడ జంక్షన్లకు ప్రయాణించే రైళ్ల అప్‌లైన్ ట్రాక్, డౌన్ లైన్ ట్రాకులతో పాటు మరో ట్రాక్ వేయడంతో ఐదు నిమిషాలకు రెండు, మూడు రైళ్ల వస్తూపోతుండటంతో ఒక్కోసారి 20 నిమిషాలకు పైగానే గేట్లు వేసి ఉంటున్నాయి. దీంతో ఈ మార్గం గుండా ప్రయాణించే వాహనదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను లేక, అనారోగ్యానికి గురైన వారిని ఖమ్మం, విజయవాడ ఆస్పత్రులకు తీసుకెళ్లే సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఒక్కో సారి ప్రాణాల మీదకు కూడా వస్తోంది. పాఠశాలలకు వెళ్లాల్సిన బస్సులు గేట్లు వేసి ఉండటంతో విద్యార్థులు సమయానికి చేరుకోలేకపోతున్నారు. ఇటీవల మూడో రైల్వే లైన్ పనుల సందర్శనకు విచ్చేసిన డీఆర్ఎంకు పలువురు స్థానికులు రైల్వే గేట్లపై ఆర్వోబీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. హామీ ఇచ్చి డీఆర్ఎం వెళ్లిపోయారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులకు పలుమార్లు ఇచ్చిన వినతులు కూడా బుట్టదాఖలు కావడంతో వారి తీరుపై ప్రయాణీకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన ఆర్వోబీల సమస్యలు పట్టించుకోకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైల్వే గేట్లపై ఆర్వోబీలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మూడు రైళ్లు వెళ్లాకే గేటు తీస్తున్నారు



రైల్వే గేట్ల వద్ద ఎక్కువ సమయం గడిచిపోతుంది. ప్రతీ రోజు గేటులో నుండే మండలకేంద్రంలోని దుకాణాలకు, కళాశాలకు, పాఠశాలలకు ఆస్పత్రులకు వెళ్ళాల్సి ఉంది. ఈసమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఎవరికీ పట్టడం లేదు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆర్వోబీ నిర్మించాలి.

– సంపత్‌కుమార్, ఎర్రుపాలెం

ఆర్వోబీలు నిర్మిస్తేనే మేలు



మండలకేంద్రంలోని రైల్వే గేటుతో పాటు రేమిడిచర్ల సమీపంలో కూడా రైళ్ల రాకపోకల రద్దీ బాగా పెరిగింది. పలుమార్లు ఉన్నతాధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్నాం. ప్రయాణికుల వినతిని రైల్వే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. రైల్వే గేట్లు వద్ద ఆర్వోబీలు నిర్మిస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

– శీలం అక్కిరెడ్డి, సొసైటీ చైర్మన్, పెద్దగోపవరం